క్లుప్తంగా

సిమెంట్ లారీ బోల్తా



బోల్తా పడిన లారీ

కొలిమిగుండ్ల: కొలిమిగుండ్ల-కల్వటాల ప్రధాన రహదారిలో ఉన్న డాఖానాయక్ బ్రిడ్జి వద్ద మంగళవారం తెల్లవారుజామున సిమెంట్ లారీ బోల్తాపడింది. వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు వైపు నుంచి సిమెంట్ లోడుతో బయలు దేరిన లారీ బ్రిడ్జి వద్దకు రాగానే అదుపుతప్పింది. ఈప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు. కాగా ప్రధాన రహదారిపై ఉన్న బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. ఇరుకుగా ఉండడంతో ఇక్కడ తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. బ్రిడ్జికి రెండు వైపులా ఉన్న సైడ్ వాల్ పడిపోవడంతో వాహనచోదకులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ కామేశ్వర్‌రావు

సంజామల: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి వి.కామేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం సంజామల ప్రాథమిక కేంద్రంలో డాక్టర్లు, ఆశవర్కర్లతో సమావేశం నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా దోమలతోనే ఎక్కువగా వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని.. పరిసరాల శుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వినోద్ కుమార్, యూనిట్ ఆఫీసర్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి జయంతిని విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న వాల్మీకి నాయకులు

డోన్ టౌన్: వాల్మీకి జయంతిని రాజకీయాలకు అతీతంగా జయప్రదం చేయాలని వాల్మీకి ఐక్యత పోరాట కమిటీ నాయకులు భాస్కర్‌నాయుడు, శివరామకృష్ణ, మేకల నాగరాజు పిలుపునిచ్చారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం సమీపంలోని ఒక లాడ్జిలో మంగళవారం సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 17వ తేదీ వాల్మీకి జయంతి నిర్వహణపై చర్చించారు. సమావేశంలో నాయకులు కృష్ణమూర్తి, శివరామకృష్ణ, పూల శ్రీను, ప్రహ్లాద, గోవిందు, నాగేంద్ర, కేశవ్, ప్రతాప్ పాల్గొన్నారు.

చెత్త బుట్టల పంపిణీ



చెత్త బుట్టలను అందిస్తున్న సర్పంచ్ మద్దిలేటి

డోన్ రూరల్: మండల పరిధిలోని ఆవులదొడ్డి గ్రామంలో సర్పంచ్ ఉల్పాల మద్దిలేటి మంగళవారం గ్రామస్తులకు చెత్త బుట్టలు పంపిణీ చేశారు. గ్రామస్తులు ఎక్కడపడితే అక్కడ చెత్త పడేయకుండా ఉండేందుకు బుట్టలు పంపిణీ చేశామన్నారు. గ్రామాలు శుభ్రంగా ఉండేందుకు సహకరించాలని కోరారు. పరిసరాల పరిశుభ్రత అందని బాధ్యత అని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

ప్యాపిలి: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ ధ్యేయమని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. మండల పరిధిలోని వివిధ గ్రామాలు చెందిన ప్రజల నుంచి సుమారు 80 వినతులు అందాయి. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. తహసీల్దార్ భారతి, ఈఓఆర్డీ బాలకృష్ణుడు, పీఆర్ డీఈ గంగాధర్, ఏఈ ప్రభాకర్ రెడ్డి, ఏఓ రాజేశ్, ఎంఈఓ వెంకటేశ్ నాయక్ పాల్గొన్నారు.

రసాయన ఎరువులు హానికరం

డోన్ రూరల్: పంట సాగులో రసాయనిక ఎరువులు అధికంగా వినియోగించడం వల్ల ఆహార ఉత్పత్తులు విషతుల్యమవుతాయని వినూత్న ఆగ్రోటెక్ మార్కెటింగ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బాషా అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రామదుర్గం గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. సేంద్రీయ, జీవన ఎరువులతో పెట్టుబడులు తగ్గించుకోవచ్చని తెలిపారు. అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు.

పండగ పూట.. ధరల మంట

- కొండెక్కిన కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలు
- కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచేస్తున్న వ్యాపారులు
- దృష్టి సారించని అధికారులు
- సామాన్యులపై ఆర్థిక భారం



కూరగాయల దుకాణం

డోన్: బీరకాయ నుంచి బీన్స్ వరకు..బియ్యం నుంచి బెల్లం వరకు అన్ని ధరలు పెరిగిపోయాయి. కూరగాయలు, నిత్యావసర ధరలు అమాంతం పెరగడంతో సామాన్యులు దసరా పండుగను సంతోషంగా జరుపుకోలేని పరిస్థితి నెలకొంది. అసలే పండుగ సీజన్ కావడంతో పేద, మధ్య తరగతి ప్రజలకు భారంగా మారాయి. ఏ కూరగాయ అడిగినా రూ.50పైనే చెబుతున్నారు. ఇక టామాట అయితే సెంచరీ(రూ.100) కొట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ధరలు కొండెక్కి కూర్చున్నాయి.

వ్యాపారుల ఇష్టారాజ్యం

నిత్యావసర సరుకులను అక్రమంగా నిల్వ ఉంచిన గోడౌన్‌లపై విజిలెన్స్ అధికారులు మామూళ్ల మత్తులో పడి దాడులు చేయకపోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. భారీ ఎత్తున సరుకులను అక్రమంగా నిల్వ ఉంచుతున్నారు. నియోజకవర్గంలోని డోన్, బేతంచెర్ల, ప్యాపిలి పట్టణాల్లోని మారుమూల ప్రాంతాల్లో గోడౌన్‌లను అద్దెకు తీసుకొని కొందరు వ్యాపారులు సరుకులను అక్రమంగా నిల్వ ఉంచి ఇష్టానుసారంగా ధరలు నిర్ణయించి అమ్ముతున్నారు. వీటిని నియంత్రించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో సామాన్యుల నెత్తిన సరుకుల ధరలు గుదిబండగా మారాయి.

కూరగాయల ధరలకు రెక్కలు

రైతు పండించిన అనేక రకాల కూరగాయలను కొందరు వ్యాపారులు సిండికేటై తక్కువ ధరకు కొంటూ గిట్టుబాటు ధర ఇవ్వడం లేదనేది వాస్తవం. ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయించే స్థోమత లేని సన్న, చిన్నకారు రైతులు ఇక్కడే తెగనమ్ముకుంటున్నారు. పెద్ద వ్యాపారులు మార్కెట్‌లోని వ్యాపారులతో కుమ్మక్కై, కూరగాయల ధరలను ఇష్టానుసారంగా పెంచి విక్రయిస్తుండడం షరా మామూలుగా మారింది.

కూరగాయల ధరలు	నిత్యావసర సరుకుల ధరలు (కేజీల్లో)
టమాట : 100	బియ్యం : 75
ఆలుగడ్డ : 60	బ్యాళ్లు : 160
ఒట్టిమిరప : 250	చింతపండు : 150
బీన్స్ : 120	జొన్నలు : 40
సొరకాయ : 80	చెక్కెర : 43
ఉల్లిగడ్డ : 80	బెల్లం : 100
బీరకాయ : 60	పామాయిల్ : 125
దొండకాయ : 60	ఎల్లిపాయలు : 380
	సన్‌ఫ్లవర్ ఆయిల్ : 140



విక్రయానికి సిద్ధంగా ఉన్న టమాట

ఇలాంటి పరిస్థితి ఎన్నడూ లేదు



గత ప్రభుత్వ హయాంలో సామాన్య, మధ్యతరగతి ప్రజలను ఆదుకునేందుకు అనేక సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు నేరుగా నగదును అందించేవారు. దీంతో ధరలు పెరిగినా సామాన్య ప్రజల్లో కొనుగోలు శక్తి కూడా ఉండేది. టీడీపీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకపోవడంతో సామాన్యుల ఆర్థిక పరిస్థితి మరింత దిగజారింది. ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ చూడలేదు. -బోయ సుమలత, కౌన్సిలర్, డోన్

అప్పుచేసి పప్పుకూడు అనే చందంగా మారింది



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నిరకాల సరుకులు, కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కూలీనాలీ చేసుకునే సామాన్య, మధ్యతరగతి ప్రజలు వీటిని కొని తినే అవకాశం లేకుండా పోయింది. ప్రస్తుత పరిస్థితుల్లో అప్పు చేసి పప్పు కూడు తినాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం స్పందించి నిత్యావసర సరుకులతో పాటు కూరగాయల ధరలు తగ్గించాల్సిన అవసరం ఉంది. -లక్ష్మీభాయి, గృహిణి, పాతపేట, డోన్

పేదల ఆర్థిక పరిస్థితి అధ్వానం



కూటమి ప్రభుత్వం విధానాలతో పేదల ఆర్థిక పరిస్థితి అధ్వానంగా మారింది. సూపర్ సిక్స్ పథకాలంటూ గంపగుత్తగా ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చిన తర్వాత పేద ప్రజల స్థితిగతులను మెరుగుపరచకపోవడం దారుణం. ఏరు దాటేంతవరకు ఓడ మల్లన్న, ఏరు దాటిన తర్వాత బోడి మల్లన్న అనే చందంగా కూటమి ప్రభుత్వం వ్యవహారం ఉంది. -లక్ష్మీదేవి, ఆర్టీసీ కాలనీ, డోన్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బనగానపల్లె రూరల్: మండలంలోని పలుకూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల కారణంగా బుధవారం సబ్‌స్టేషన్ పరిధిలోని యనకండ్ల, హుస్సేనాపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ రూరల్ ఏఈ గర్జప్ప తెలిపారు. వ్యవసాయానికి తెల్లవారుజామున 4 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు.

డోన్ టౌన్: స్థానిక వెంకటాపురం రోడ్డులోని పేరంటాలమ్మ గుడి సబ్‌స్టేషన్‌లో అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి తెలిపారు. జాతీయ రహదారి, కోట్ల నగర్, వైఎస్సార్ నగర్, తారకరామనగర్, శ్రీరామ నగర్, ఆర్టీసీ కాలనీ, శ్రీనివాసనగర్, పోచానగర్, నెహ్రూనగర్‌తో పాటు మల్లెంపల్లె ఫీడర్ కింద ఉన్న లక్ష్మంపల్లె, మల్లెంపల్లె గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. రైతులకు ఇచ్చే త్రీఫేస్ కరెంటు తెల్లవారుజామున 5 గంటల నుంచి 10 గంటల వరకు మళ్లీ సాయంత్రం 3 గంటల నుంచి 7 గంటల వరకు ఇస్తామని తెలిపారు.

బేతంచెర్ల: మండలంలోని సిమెంట్ నగర్ నుంచి బేతంచెర్లకు వచ్చే విద్యుత్ లైన్‌లో మరమ్మతుల కారణంగా డోన్, బనగానపల్లె, కర్నూలు రహదారిలోని పరిశ్రమలకు బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. పరిశ్రమల యజమానులు సహకరించాలని కోరారు. అలాగే రైతులకు తెల్లవారుజామున 4 గంటల నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



మున్సిపల్ చైర్మన్ రాజేష్‌తో చర్చిస్తున్న పారిశుధ్య కార్మికులు

డోన్ టౌన్: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి శివరామ్, మండల అధ్యక్షుడు నక్కి శ్రీకాంత్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షకార్యదర్శులు పెద్ద ఎల్లయ్య, కుల్లాయప్ప కోరారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ సప్తశైల రాజేష్‌ను కలిసి సమస్యలపై చర్చించి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గతంలో సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని.. అర్హత కలిగిన డ్రైవర్లకు రూ.24 వేల వేతనం ఇవ్వాలని కోరారు. ఆప్కాస్‌లో పేరు నమోదు కాలేదన్న సాకుతో తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, సంక్రాంతి కానుకలు, మరణించిన కార్మిక కుటుంబాలకు రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం తదితర డిమాండ్లను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

విచక్షణా రహితంగా రసాయన ఎరువులు వాడొద్దు



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

కోవెలకుంట్ల: వివిధ పంటల్లో రసాయన ఎరువుల వినియోగం సాధ్యమైనంత వరకు తగ్గించాలని మండల వ్యవసాయాధికారి నిరంజన్ సూచించారు. మంగళవారం మండలంలోని బిజనవేముల, వెలగటూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ.. ఆయా పంటల్లో అధిక దిగుబడులు సాధించాలన్న తపనతో రైతులు విచక్షణా రహితంగా రసాయన ఎరువులు వాడుతున్నారని తెలిపారు. అధిక ఎరువుల వాడకంతో భూమిలో పోషకాలు నశించి దిగుబడులు తగ్గిపోతాయన్నారు. రబీ సీజన్ ప్రారంభమైన దృష్ట్యా రైతులు పంటలు సాగు చేసిన వెంటనే ఈ-పంట నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించి పంట నష్టం సంభవిస్తే ఈ పంట నమోదు ఆధారంగానే నష్టపరిహారం అందజేస్తామని తెలిపారు. అనంతరం వివిధ పంటల యాజమాన్యం, తెగుళ్లు, పురుగుల నివారణ, భూసార పరిరక్షణ ఆవశ్యకత, భూసార పరీక్షల పత్రాల పంపిణీ, కిషాన్ డ్రోన్ల వినియోగం, బిందుసేద్యం తదితర అంశాలను వివరించారు. పశు వైద్యాధికారి కృష్ణకుమార్ ఉన్నారు.

వన్యప్రాణులతో పర్యావరణ సమతుల్యం



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న అటవీ అధికారులు

డోన్: సమస్త జీవరాశులను సంరక్షించుకోగలిగితేనే వాతావరణ సమతుల్యం సాధ్యపడుతుందని ఫారెస్ట్ రేంజ్ అధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాల సందర్భంగా మంగళవారం స్థానిక కార్యాలయం నుంచి పాతపేటలోని పాత మున్సిపల్ కార్యాలయం వరకు అటవీశాఖ ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అడవులను విచక్షణారహితంగా నరికివేయడం, మొక్కలు నాటి సంరక్షించుకపోవడం లాంటి కారణాలతో వన్యప్రాణుల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ వన్యప్రాణులపై ప్రేమ, దయ కనబరచాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో డీఆర్ఓ రవీంద్రనాయక్, ప్యాపిలి ఎఫ్ఎస్ఓ శివశంకర్, డోన్ ఎఫ్‌బీఓ విష్ణు, మల్కాపురం, మాధవరం, చింతలపేట బీట్ అధికారులు భారతి, శివమ్మ, వీరకుమార్ పాల్గొన్నారు.

పీఆర్సీ అమలు చేయాలి

డోన్ టౌన్: ప్రభుత్వ ఉద్యోగులకు 12వ పీఆర్సీ అమలు చేయాలని.. లేకుంటే అంత వరకు 30 శాతం మధ్యంతర భృతి(ఐఆర్) ఇవ్వాలని యూటీఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి నరసింహారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షురాలు శాంతిప్రియ, అబ్దుల్ లతీఫ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆన్‌లైన్‌లో ఆ సంఘం నాయకులతో మాట్లాడారు. 2023 జూలై 1వ తేదీ నుంచి 12వ పీఆర్సీ అమలు చేయాల్సి ఉన్నా ఇప్పటి వరకు అమలు చేయలేదని తెలిపారు.

ఈ నెల 10వ తేదీ రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. యూటీఎఫ్ నాయకులు కృష్ణనాయక్, రమేష్‌నాయుడు, మధు, బొజ్జన్న, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అడ్డుకునేందుకు దేనికైనా సిద్ధం

కోవెలకుంట్ల: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు సుప్రీం కోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని, ఆ దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటే అడ్డుకోవడానికి ప్రాణాలైనా అర్పిస్తామని అంబేడ్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు మహేష్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ చేపట్టవద్దని వేసిన రివ్యూ పిటిషన్‌ను కోర్టు సెప్టెంబర్ 24వ తేదీ కొట్టి వేసిందన్నారు. వర్గీకరణ జరిగితే మాలలు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో వెనుకబడిపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎస్సీ, ఎస్టీ వర్గీకరణను అడ్డుకునేందుకు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

● ఫలాల్లో రారాజు సీతాఫలం



మార్కెట్‌లోకి వచ్చిన సీతాఫలం

డోన్: ఏ సీజన్‌లో లభించే ఫలాలు ఆ సీజన్‌లో తింటే ఆరోగ్యం. అడవుల్లో ఒకప్పుడు ఎక్కడ చూసినా కనిపించే సీతాఫలం చెట్లు నేడు మచ్చుకైనా కనిపించవు. పొలాల గట్ల వద్ద అక్కడక్కడ కనిపిస్తున్నాయి. కొంతకాలానికి చాలా పండ్ల మాదిరిగానే సీతాఫలం కూడా కనుమరుగైనా ఆశ్చర్యపోనక్కర్లేదు. పట్టణంలో ఈ ఏడాది సీతాఫలం కిలో రూ.140 నుంచి రూ.150 వరకు విక్రయిస్తున్నారు. వీటిలో పోషకాలు మెండుగా ఉండడంతో కొనుగోలు చేయడానికి ప్రజలు ఆసక్తి చూపుతున్నారు.

ఈఓఆర్డీగా బాధ్యతలు

బేతంచెర్ల: మండల ఈఓఆర్డీగా మల్లికార్జున మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇది వరకు ఇక్కడ పనిచేసిన వెంకట రంగనాయక్ నందికొట్కూరుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో హాలహర్వి మండలంలో పనిచేస్తున్న మల్లికార్జున బేతంచెర్లకు వచ్చారు.

మద్యం దుకాణాల దరఖాస్తుకు నేడు ఆఖరు

బనగానపల్లె రూరల్/కొలిమిగుండ్ల: ప్రైవేటు మద్యం దుకాణాల నిర్వహణ కోసం దరఖాస్తు చేసుకోవడానికి బుధవారం ఆఖరు రోజని ఎక్సైజ్ సీఐ వర్ధనాదేవి, ఎస్ఐ కమలాకర్ తెలిపారు. ఆయా మండలాల్లో వేర్వేరుగా విలేకరులతో మాట్లాడుతూ.. బనగానపల్లె ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పరిధిలోని అవుకు, కొలిమిగుండ్ల, బనగానపల్లె మండలాల్లో 12 దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానించినట్లు చెప్పారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండింటిలోనూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రూ.2లక్షల నాన్ రిఫండబుల్ డీడీ తప్పని అన్నారు. కొలిమిగుండ్ల మండలంలో మూడు దుకాణాలకు ఇప్పటి వరకు ఒక్కొక్క దరఖాస్తు మాత్రమే వచ్చాయన్నారు.

కోవెలకుంట్ల పరిధిలో 62 దరఖాస్తులు

కోవెలకుంట్ల: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 11 దుకాణాలకు 62 దరఖాస్తులు అందినట్లు ఆ శాఖ సీఐ తాకీబాషా తెలిపారు. కోవెలకుంట్ల మండలంలోని ఐదు షాపులకు 30, సంజామల మండలంలో నాలుగు షాపులకు 16 , దొర్నిపాడులో ఒక్క షాపుకు ఎనిమిది, ఉయ్యాలవాడలో ఒక్క షాపుకు 8 చొప్పున దరఖాస్తులు వచ్చాయన్నారు.

డోన్ సర్కిల్‌లో 101 దరఖాస్తులు

డోన్: డోన్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 16 మద్యం దుకాణాలకు మంగళవారం సాయంత్రానికి 101 దరఖాస్తులు అందాయని ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి, ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. మంగళవారం ఒక్క రోజే 25 మంది దరఖాస్తు చేసినట్లు చెప్పారు. చివరి రోజు మరిన్ని దరఖస్తులు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.

విద్యుత్ తీగలు చోరీ

సంజామల: మండల పరిధిలోని పేరుసోముల గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు వ్యవసాయ బోరుబావుల వద్ద విద్యుత్ తీగలు చోరీ చేశారు. మంగళవారం పది మందికి చెందిన విద్యుత్ వైర్లు ఒక్కొక్కరిది 10 మీటర్ల వరకు చోరీ చేసినట్లు రైతులు తెలిపారు.

పంచాయతీరాజ్ ఏఈ బాధ్యతలు

బేతంచెర్ల: పంచాయతీరాజ్ ఏఈగా మహేష్ బాధ్యతలు తీసుకున్నారు. ఇది వరకు ఇక్కడ పనిచేసిన గణేష్ వైఎస్సార్ జిల్లాకు బదిలీ అయ్యారు. కోవెలకుంట్ల మండలంలో పనిచేస్తున్న మహేష్ ఇక్కడికి వచ్చారు. మండలంలో గ్రామాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

వర్షం కోసం పూజలు

సంజామల: మండల పరిధిలోని ఆర్.లింగందిన్నె గ్రామంలో వర్షం కోసం రైతులు, గ్రామస్తులు మంగళవారం పూజలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని గంగమ్మకు మొక్కుకున్నారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

బనగానపల్లె: బనగానపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ తెలిపారు. బనగానపల్లె మండలం వెంకటాపురం ఆయా పోస్టు ఈడబ్ల్యూఎస్‌కు, పలుకూరు-3 ఎస్సీ, అవుకు మండలం కొండమనాయునిపల్లె బీసీ-డీ, కోవెలకుంట్ల మండలంలోని బీమునిపాడు -1(ఎస్సీ), సంజామల-1(ఓసీ), సంజామల-2 బీసీ-డీకి కేటాయించినట్లు వెల్లడించారు. అలాగే సంజామల-3 కార్యకర్త పోస్టు ఎస్సీకి కేటాయించినట్లు చెప్పారు. పదో తరగతి ఉత్తీర్ణులై 21 నుంచి 35 ఏళ్ల లోపు మహిళా అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఈ నెల 21వ తేదీలోపు ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

శక్తిరూపిణి.. ముక్తిప్రదాయిని



బాలత్రిపుర సుందరిదేవిగా వాసవీమాత



కొలిమిగుండ్ల: మహాలక్ష్మిగా రాజరాజేశ్వరిదేవి



నందవరంలో కాత్యాయనిగా చౌడేశ్వరిదేవి




బనగానపల్లె: మంగళగౌరి దేవిగా వాసవీమాత

దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం పలు ఆలయాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. ముక్తిని ప్రసాదించే శక్తిరూపిణిని భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. పలు ఆలయాల వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మద్దిలేటి స్వామి ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మిగా..బనగానపల్లె మండలం నందవరంలోని చౌడేశ్వరిదేవి కాత్యాయనిగా భక్తులకు అభయమిచ్చారు. -సాక్షి నెట్‌వర్క్







అమ్మవారిశాలలో రాజరాజేశ్వరిగా..,అమ్మవారిశాలలో సంతానలక్ష్మి, మద్దిలేటిస్వామి ఆలయంలో శ్రీమహాలక్ష్మి





బేతంచెర్ల: గరుడ వాహనంపై వేంకటేశ్వరస్వామి, ప్యాపిలి: అమ్మవారి ముందు నృత్యం చేస్తున్న బాలిక

రైతుల సంక్షేమానికి పెద్ద పీట



శనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోట్ల, సుబ్బారెడ్డి

బేతంచెర్ల: రైతు సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని..అవసరమైన రైతులందరికీ విత్తనాలు అందజేస్తున్నామని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాశ్ రెడ్డి, ఏపీ సీడ్స్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురంలో రైతులకు రాయితీ శనగ విత్తనాలు పంపిణీ చేశారు. బేతంచెర్ల మండలానికి 428 క్వింటాళ్ల విత్తనాలు మంజూరైనట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. ఏడీఏ అశోక్‌వర్ధన్ రెడ్డి, ఏఓ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

అవుకు: రాయితీపై అందించే శనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్ సూచించారు. మండల పరిధిలోని సుంకేసుల, కాశీపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అవుకు మండలానికి 2021 క్వింటాళ్ల శనగ విత్తనాలు మంజూరయ్యాయని తెలిపారు. సాధారణ ధర రూ.9400 కాగా 25శాతం రాయితీ పోను రూ.7050లకు అందిస్తున్నామని చెప్పారు. అనంతరం మట్టి నమూనా పరీక్ష కార్డులను రైతులకు పంపిణీ చేశారు.

మిరపకాయలు విక్రయించారంటూ గగ్గోలు

కోవెలకుంట్ల: గోదాములో నిల్వ ఉంచిన మిరపకాయలను అనుమతి లేకుండా విక్రయించారని సంజామల మండలం పేరుసోముల గ్రామానికి చెందిన రైతు సూర్యనారాయణరెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు. అతని వివరాల మేరకు.. 2023లో పండించిన 128 బస్తాల ఎండు మిరపకాయలను కోవెలకుంట్ల మండలం సౌదరదిన్నె గ్రామ సమీపంలో ఉన్న గోదాములో నిల్వ ఉంచాడు. దిగుబడులపై ఉయ్యాలవాడ మండలం మాయలూరు కరూర్ వైశ్య బ్యాంకులో రూ. 5.52 లక్షల రుణం తీసుకున్నాడు. అదే ఏడాది డిసెంబర్ 1వ తేదీ తీసుకున్న రుణంలో రూ. లక్ష తిరిగి చెల్లించాడు. మిగిలిన రుణం కట్టాలని బ్యాంకు అధికారులు గ్రామానికి వచ్చారు. రుణం చెల్లించకపోతే మిరప దిగుబడులను వేలం వేస్తామని చెప్పి నోటీసు ఇచ్చి సంతకం చేయించుకున్నారు. వేలం వేసే రోజున సమాచారం అందిస్తామని బ్యాంకు అధికారులు తెలిపారు. గత నెల 23వ తేదీ మిరపకాయలు అమ్మేందుకు గోదాముకు వెళ్లగా దిగుబడులను విక్రయించామని గోదాము యాజమాన్యం చెప్పింది. బ్యాంకు అధికారుల రిలీజ్ ఆర్డర్ లేకుండా దిగుబడులను ఎలా విక్రయిస్తారని గోదాము యాజమాన్యంతో వాగ్వాదానికి దిగినా ప్రయోజనం లేకుండా పోయింది. మిరప దిగుబడులను రూ. 10 లక్షలకు విక్రయించినట్లు తెలుసుకుని బాధిత రైతు లబోదిబోమంటున్నాడు. బ్యాంకు రుణం, గోదాము బాడుగ పోయినా తనకు ఇంకా రూ. 5 లక్షలు వస్తుందని వాపోయాడు. ఈ సంఘటనపై న్యాయ పోరాటం చేస్తామని తెలిపాడు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు పనిభారం తగ్గించాలి



వినతి పత్రం అందిస్తున్న అంగన్‌వాడీలు

డోన్ టౌన్: అంగన్‌వాడీ కార్యకర్తలకు పనిభారం తగ్గించాలి ఆ సంఘం మండల నాయకులు సులోచన, రహ్మాద్‌బీ, సీఐటీయూ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు నక్కి శ్రీకాంత్, శివరామ్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సూపర్‌వైజర్లు పరమేశ్వరమ్మ, తిప్పమ్మ, శోభరాణిలకు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. వివిధ పేర్లతో ఐదు యాప్‌లు, వాటిలో వివరాలు నమోదు చేయడం లాంటి పనులతో అధిక భారం మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు.